# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 130 క్రిష్ణా, బుధవారం 04 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# మేం జోక్యం చేసుకోం

'టెలికాం' ట్రైబ్యునల్‌లోనే తేల్చుకోండి

ఏపీలో సాక్షి టీవీ ప్రసారాల నిలిపివేతపై సుప్రీంకోర్టు

ఇందిరా టెలివిజన్ పిటిషన్ కొట్టివేత

చట్టబద్ధ పరిష్కార మార్గాలు ఉన్నప్పుడు నేరుగా విచారణ చేయలేమన్న సుప్రీం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి టీవీ ప్రసారాల నిలిపివేతపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ వ్యవహారం ఇప్పటికే టెలికాం వివాదాల పరిష్కార, అప్పిలేట్ ట్రైబ్యునల్ (టీడీ శాట్) పరిధిలో ఉన్నందున, అక్కడే తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. 'ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఏపీ ఫైబర్ నెట్ చానల్స్ ప్యాకేజీ నుంచి సాక్షి టీవీని తొలగించారు. మేజర్ ఎంఎస్వో ఆపరేటర్లను బెదిరించారు. రాష్ట్ర ప్రభుత్వమే మీడియా స్వేచ్ఛను హరిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)(ఏ)ను ఉల్లంఘిస్తున్నారు. ఏపీ ఫైబర్ నెట్ నుంచి సాక్షి టీవీని తొలగించడం చట్టవిరుద్ధం. తిరిగి ప్యాకేజీ చానల్స్‌లో పెట్టేలా ఆదేశాలు జారీ చేయండి' అని 2025 జూలై 19న ఇందిరా టెలివిజన్ లిమిటెడ్(సాక్షి టీవీ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ పీఎస్ నరసింహం, జస్టిస్ అలోక్ ఆరాధేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఇందిరా టెలివిజన్ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆంధ్రప్రదేశ్ అధికారులు, మల్టీ సిస్టమ్ ఆపరేటర్ల (ఎంఎస్వో) ద్వారా తమ ప్రసారాలను అక్రమంగా నిలిపివేశారని, బ్లాక్ అవుట్ చేశారని అన్నారు. ప్రసారాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రసారాల నిలిపివేతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ఆదేశాలు లేవని తెలిపారు.

ఇది కేవలం ప్రైవేట్ ఆపరేటర్లకు సంబంధించిన అంశమని తెలిపారు. దీంతో ఈ కేసు ట్రైబ్యునల్ పరిధిలో ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ క్రమంలో పిటిషనర్ తరపు న్యాయవాది మరికొన్ని అంశాలను ప్రస్తావిస్తూ విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేయాలని కోరారు. జస్టిస్ నరసింహ స్పందిస్తూ.. ఇప్పటికే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించినందున, అక్కడ తీర్పు వచ్చిన తర్వాత హైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చట్టబద్ధమైన పరిష్కార మార్గాలు అందుబాటులో ఉన్నప్పుడు నేరుగా సుప్రీంకోర్టు విచారణ కొనసాగించడం సమంజసం కాదన్నారు. "ట్రైబ్యునల్ ఇప్పటికే ఈ వ్యవహారాన్ని విచారణకు స్వీకరించింది. కాబట్టి రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం దాఖలైన ఈ పిటిషన్‌ను ఇప్పుడు విచారించలేం. పిటిషనర్ తన వాదనలను ట్రైబ్యునల్ ముందు వినిపించేందుకు పూర్తి స్వేచ్ఛ ఉంది. ట్రైబ్యునల్ లేదా హైకోర్టు ఇచ్చే తీర్పుల పట్ల సంతృప్తి చెందని పక్షంలో మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు" అని ధర్మాసనం తెలిపింది.

# తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలు: వాతావరణ శాఖ



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, తెలుగు రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకునే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఫిబ్రవరి నెలలోకి ప్రవేశించడంతో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశముందని, మార్చి నాటికి మరింతగా పెరుగుతాయని వెల్లడించింది. ఏపీలో ఉదయం వేళ పొగమంచు, స్వల్పంగా చలిగాలులు వీస్తుండగా, తెలంగాణలోనూ చలి గాలులు తగ్గిపోయి, గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి రెండో వారం నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపారు.రాయలసీమ:-మంగళవారం, బుధవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. పొగమంచు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశము ఉంది.గురువారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది.

గమనిక:- రాగల 5 రోజుల్లో ఆంధ్రప్రదేశ్, యానములో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదులో గణనీయమైన మార్పు ఉండదు.

# మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా మారనుంది



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు.ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ఈ ఒప్పందం వల్ల దేశ ఎగుమతి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా యువతకు, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

# ఏపీ అభివృద్ధి లక్ష్యంగా ఢిల్లీకి మంత్రి నారా లోకేశ్: కేంద్ర మంత్రులతో కీలక భేటీలు!



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరులు, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు దేశ రాజధాని ఢిల్లీకి పయనం కానున్నారు. అమరావతిలో జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఆయన తన పర్యటనను ప్రారంభించనున్నారు. షెడ్యూల్ ప్రకారం, మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టుల సాధన దిశగా ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీ చేరుకున్న అనంతరం, రేపు ఉదయం లోకేశ్ పార్లమెంట్ భవనానికి వెళ్లి అక్కడ పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలవనున్నారు. రాష్ట్రంలోని విద్యారంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలు, ఐటీ రంగ విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ఆయన కేంద్రానికి వివరించే అవకాశం ఉంది. అలాగే ఏపీలో నిరుద్యోగితను తగ్గించేందుకు అవసరమైన కేంద్ర సహకారాన్ని కోరనున్నారు. ఈ భేటీలలో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా చర్చలు సాగనున్నాయి.

రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న కేంద్ర పథకాల అమలుపై కూడా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా ఐటీ హబ్‌ల ఏర్పాటు మరియు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతానికి కేంద్ర మంత్రుల నుంచి సానుకూల హామీలను పొందే ప్రయత్నం చేయనున్నారు. కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలను కేంద్రానికి వివరించి, పెట్టుబడుల ఆకర్షణలో కేంద్రం తోడ్పాటును ఆయన కోరనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన ద్వారా రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు ముగించుకున్న అనంతరం, రేపు అర్ధరాత్రికి మంత్రి నారా లోకేశ్ తిరిగి ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. పర్యటన వివరాలను మరియు కేంద్రం నుంచి లభించిన స్పందనను ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నివేదించే అవకాశం ఉంది. కేవలం రెండు రోజుల వ్యవధిలో జరుగుతున్న ఈ మెరుపు పర్యటనతో రాష్ట్ర రాజకీయాల్లో మరియు పాలనలో కీలక మార్పులు వస్తాయని ఆశిస్తున్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికే ఈ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

# అంగారక గ్రహంపై చరిత్ర సృష్టించిన నాసా:



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, కృత్రిమ మేధస్సు ప్రతి రంగంలో తన ప్రభావాన్ని చాటుకుంటూ ముందుకు సాగుతోంది. తాజాగా అమెరికా అంతరిక్ష సంస్థ నాసా, అంతరిక్ష యాత్రలో ¬ూ× సహాయంతో ఒక కీలక విజయాన్ని నమోదు చేసింది.చీూూూ మార్స్ రోవర్ పెర్సెవరెన్స్, ఆంత్రోపిక్ అభివృద్ధి చేసిన చాట్‌బాట్ 'క్లాడ్' అందించిన ఆదేశాలను ఉపయోగించి తన తొలి డ్రైవ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మరో గ్రహంపై రోవర్ కదలికలను ప్రణాళిక చేయడంలో ఒక జనరేటివ్ మోడల్ ప్రత్యక్షంగా పాత్ర పోషించడం ఇదే తొలిసారి కావడంతో ఇది చారిత్రక ఘట్టంగా నిలిచింది.నాసా మిషన్లలో పాత్ర రోజు రోజుకీ మరింత కీలకంగా మారుతోంది. జనవరి 27న పెర్సెవరెన్స్ రోవర్ తన తొలి డ్రైవ్‌ను పూర్తి చేసింది. ఈ సందర్భంగా క్లాడ్, ఉన్నత స్థాయి నావిగేషన్ సూచనలను అందించగా, వాటిని అంగారక గ్రహానికి పంపే ముందు ఖచ్చితమైన వే పాయింట్‌లుగా మార్చారు. సాధారణంగా ఈ ప్రక్రియ క్లిష్టమైన లెక్కలు, విస్తృత ప్రణాళికలను అవసరం చేస్తుంది, ఇవి సైంటిస్టులే నిర్వహిస్తారు. అయితే ఈ సంక్లిష్టతను గణనీయంగా తగ్గించింది.ఈ విజయాన్ని నాసా జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ ఒక న్యూస్‌రూమ్ పోస్ట్ ద్వారా వెల్లడించింది. మానవ మిషన్ ప్లానర్ క్లాడ్‌కు భూభాగ మ్యాప్‌తో పాటు శాస్త్రీయ లక్ష్యాలను అందించడంతో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఆపై చాట్‌బాట్, మార్గ పరిమితులు, వాలు నియంత్రణలు, భద్రతా అంశాలను పరిగణనలోకి తీసుకుని రోవర్ చేరుకోవాల్సిన వే పాయింట్లు లేదా మధ్యస్థ కోఆర్డినేట్‌ల క్రమాన్ని రూపొందించింది. ఈ వే పాయింట్‌లను మిషన్ ఇంజనీర్లు సమీక్షించి అవసరమైన మార్పులు చేసిన తర్వాత, భూమి నుంచి అంగారక గ్రహం వరకు సుమారు 362 మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఉన్న పెర్సెవరెన్స్‌కు అప్‌లింక్ చేశారు అని ఆంత్రోపిక్ ఒక పోస్ట్‌లో పేర్కొంది.

# యువతుల ఫోటోలు చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, ఇటీవల కాలంలో హనీట్రాప్ మోసాలు ఎక్కువ అవుతున్నాయి. ఈ మోసాలకు గురైన బాధితులు పరువుపోతుందన్న భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు వేస్తుంటారు. తాజాగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఓ బాధితుడు ఫిర్యాదు చేయడంతో హనీట్రాప్ మోసానికి పాల్పడిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. తంగెళ్లబీడుకు చెందిన కనపర్తి రేణుక అనే మహిళ యువతులను ఆకర్షించేలా అమ్మాయిల ఫొటోలు చూపిస్తూ వ్యక్తులను మాయలో పడేసి డబ్బులు దోచుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో మాధవరావు అనే వ్యక్తిని పిలిపించి అతని వద్ద నుంచి ఉంగరం, రూ.5 వేల నగదును కాజేసింది. అనంతరం అత్యాచారం కేసు పెడతానని బెదిరిస్తూ మరో రూ.2 లక్షలు డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, రేణుకతో పాటు ఆమెకు సహకరించిన మరో వ్యక్తిని అరెస్టు చేశారు.

# నెయ్యి కల్తీపై మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తు:

## ‘ఆలీబాబా’ వెనుక ఉన్న అసలు రహస్యమేంటి?



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పవిత్రతను దెబ్బతీసేలా విచ్చలవిడిగా నిర్ణయాలు తీసుకున్నారని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలు లేకుండానే కల్తీ నెయ్యిని తయారు చేసేలా నిబంధనలను మార్చి వైసీపీ నేతలు బరితెగించారని ఆయన ఆరోపించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యి నాణ్యత విషయంలో అడ్డగోలుగా వ్యవహరించి, హిందువుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వర స్వామి ప్రసాదం విషయంలో అపచారం చేశారని ఆయన ధ్వజమెత్తారు. టీటీడీ నెయ్యి కల్తీ జరిగిందని తాము అంటుంటే, అందులో జంతు కొవ్వు కలవలేదని వైసీపీ నేతలు చేస్తున్న వాదనలు విడ్డూరంగా ఉన్నాయని మంత్రి ఎద్దేవా చేశారు. జంతు కొవ్వు కలవలేదని చెబుతున్న వైసీపీ నేతలు, కనీసం కల్తీ జరిగిందని పరోక్షంగా ఒప్పుకుంటున్నారని ఆయన విశ్లేషించారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే నెయ్యి కల్తీ అయిందని నివేదికలు స్పష్టం చేసినప్పటికీ, నాటి పాలకులు ఆ హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోకుండా భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని ఆయన విమర్శించారు.

నెయ్యి సరఫరా కాంట్రాక్టుల విషయంలో జరిగిన అవకతవకలపై సత్యకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పదంగా మారిన భోలేబాబా డెయిరీని తెరపైకి తెచ్చిన ఆ ‘ఆలీబాబా’ ఎవరో త్వరలోనే తేలాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు ఈ కల్తీ మాఫియా వెనుక ఉన్నారని, వీరందరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

కేవలం నెయ్యి కల్తీతోనే ఆగకుండా, టీటీడీ వంటి అత్యున్నత ధార్మిక సంస్థలో అన్యమతస్థులను నియమించి జగన్ మోహన్ రెడ్డి పవిత్రతను మంటగలిపారని మంత్రి విమర్శించారు. స్వామివారి సేవలో హిందూయేతరులను చేర్చుకోవడం ద్వారా ఆలయ సంప్రదాయాలను తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన ప్రతి అక్రమంపై పూర్తిస్థాయి విచారణ జరుగుతుందని, బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదని మంత్రి సత్యకుమార్ హెచ్చరించారు.

# అమరావతి వేదికగా టాలీవుడ్ కొత్త ప్రయాణం: ఏప్రిల్‌లో కీలక ప్రకటనలు!

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని సినీ పరిశ్రమకు అసలైన కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోంది. హైదరాబాద్‌లోని చిత్ర పరిశ్రమకు ఏమాత్రం తీసిపోని విధంగా, ఇక్కడ అన్ని వసతులతో కూడిన సినీ హబ్‌ను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో అమరావతిని సినిమా షూటింగ్‌లకు, నిర్మాణానంతర పనులకు స్వర్గధామంగా తీర్చిదిద్దేందుకు కసరత్తులు మొదలయ్యాయి.

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నంది అవార్డుల ప్రదానోత్సవంపై మంత్రి సానుకూల ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లతో చర్చించి, త్వరలోనే నంది అవార్డులతో పాటు నాటక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కళాకారులను గౌరవించుకోవడం ద్వారా పరిశ్రమకు కొత్త ఉత్తేజం వస్తుందని, ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రంలో సినిమా రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ఏప్రిల్ నెలలో ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోబోతోంది. పరిశ్రమ వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రాయితీలు మరియు ఇతర ప్రోత్సాహకాలపై ఆ నెలలో స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రభుత్వం తీసుకునే ఈ నిర్ణయాలు ఏపీలో సినిమా షూటింగ్‌ల సంఖ్యను పెంచడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.



సచివాలయంలో తాజాగా నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ విజేతల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, వర్ధమాన కళాకారులను అభినందించారు. వారికి జ్ఞాపికలు అందజేస్తూ, ప్రతిభ ఉన్న యువ దర్శకులు, నటీనటులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని హామీ ఇచ్చారు. చిన్న సినిమాల నుండే పెద్ద దర్శకులు పుట్టుకొస్తారని, అటువంటి వారి కోసం అమరావతిలో మరిన్ని వేదికలను సిద్ధం చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# నెయ్యి వివాదం: నిబంధనల సడలింపే కల్తీకి కారణమా?

## మంత్రి పయ్యావుల సంచలన వ్యాఖ్యలు



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) నెయ్యి కొనుగోలు వ్యవహారంలో గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిబంధనలను నీరుగార్చిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత బోర్డు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్లే నాణ్యత లేని నెయ్యి సరఫరా చేసే సంస్థలకు మార్గం సుగమమైందని ఆయన ఆరోపించారు. పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి విషయంలో ఇంతటి నిర్లక్ష్యం ప్రదర్శించడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

టీడీపీ హయాంలో ఉన్న కఠినమైన నిబంధనలను వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా మార్చివేసిందని మంత్రి వివరించారు. గతంలో నెయ్యి సరఫరా చేసే డెయిరీలకు కనీసం మూడు ఏళ్ల అనుభవంతో పాటు, ఏడాదికి 4 లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం ఉండాలనే నిబంధన ఉండేదని గుర్తు చేశారు. అంతేకాకుండా సదరు సంస్థలకు రూ. 250 కోట్ల వార్షిక టర్నోవర్ ఉండాలని తాము నిబంధన పెడితే, గత ప్రభుత్వం ఆ టర్నోవర్‌ను రూ. 150 కోట్లకు తగ్గించి, అసలు పాల సేకరణతో సంబంధం లేకుండానే టెండర్లు దక్కించుకునేలా మార్పులు చేసిందని విమర్శించారు.

నెయ్యి కల్తీకి సంబంధించి గత ప్రభుత్వానికి ముందే హెచ్చరికలు అందినప్పటికీ వారు పట్టించుకోలేదని పయ్యావుల కేశవ్ ఆరోపించారు. నెయ్యిలో ఫిష్ ఆయిల్, బీఫ్ టాలో (జంతువుల కొవ్వు) కలిసినట్లు 2022 ఆగస్టులోనే సిఎఫ్టిఆర్ఐ నివేదిక ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఇంతటి ఘోరమైన విషయం బయటపడినప్పటికీ, అప్పటి పాలక మండలి తగిన చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం వెనుక ఉన్న ఆంతర్యమేంటని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం సాంకేతిక లోపం కాదని, వ్యవస్థీకృతమైన నిర్లక్ష్యమని దుయ్యబట్టారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరుపుతోందని, బాధ్యులెవరైనా సరే విడిచిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. తిరుమల పవిత్రతను కాపాడటం తమ ప్రథమ ప్రాధాన్యతని, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నాణ్యతా ప్రమాణాలను అమలు చేస్తున్నామని తెలిపారు. సరఫరాదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, కేవలం అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన సంస్థల నుండే నెయ్యి సేకరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

# క్యాన్సర్ రోగులకు ఉచిత వైద్యం: మంత్రి సత్యకుమార్

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03, క్యాన్సర్ రోగులకు ఏటా రూ.600 కోట్లతో ఉచిత వైద్యం అందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. క్యాన్సర్ నియంత్రణకు మరిన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి కోసం పాలియేటివ్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని, 23 సెకండరీ ఆసుపత్రుల్లో డే కేర్ కీమో థెరపీ సెంటర్లను నెలకొల్పుతున్నామని మంత్రి వివరించారు.

# రేట్లు పెంచి అమ్మితే ఊరుకునేది లేదు.



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 03 ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ అమ్మకాల విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సీరియస్ అయ్యారు. ఈ మేరకు లిక్కర్ షాప్ యజమానులకు ఆయన వార్నింగ్ ఇచ్చారు. అధిక ధరలకు మద్యం విక్రయించడం నిబంధనలకు విరుద్ధం.. మద్యం దుకాణదారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు అంటూ.. పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. లిక్కర్ షాపుల్లో మద్యం బాటిళ్లు వీ్రా కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు అందిందని.. ఇకనైనా జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరించారు. కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని.. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు.. ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం దుకాణాలపై నిఘా పెట్టి.. అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో పవన్ కళ్యాణ్ స్పందించడం చర్చనీయాంశంగా మారింది.

చర్యలు తీసుకోండి..

ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా ఇలా పోస్ట్ చేశారు. “రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో ఎం.ఆర్.పి కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఫిర్యాదు అందింది. కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ‘అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. అది ప్రభుత్వానికి చెడ్డ పేరు కూడా తెస్తుంది. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని..” స్పష్టం చేశారు. సంబంధిత శాఖ అధికారులు మద్యం దుకాణాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు.

# అమరావతికి చట్టబద్ధమైన భరోసా అవసరం:



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 03 ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పుంజుకుంటున్న తరుణంలో, ఈ ప్రాజెక్టుకు పటిష్టమైన చట్టపరమైన మరియు న్యాయపరమైన రక్షణ కల్పించాలని తాజాగా విడుదలైన సోషల్ ఆడిట్ రిపోర్టు స్పష్టం చేసింది. రాజకీయ మార్పులు లేదా ఇతర బాహ్య ప్రభావాల వల్ల ప్రాజెక్టు భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ నివేదిక అభిప్రాయపడింది. ఇంతటి భారీ స్థాయి ప్రాజెక్టులు అర్ధాంతరంగా నిలిచిపోతే లేదా మార్పులకు లోనైతే వ్యవస్థపై నమ్మకం సడలుతుందని, అందుకే దీన్ని ఒక చట్టబద్ధమైన హామీగా మార్చాలని నిపుణులు సూచిస్తున్నారు.

రాజధాని ప్రాంతంలోని స్థానిక ప్రజల జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని ఈ నివేదిక నొక్కి చెప్పింది. రాజకీయ అనిశ్చితి లేదా ప్రాజెక్టు జాప్యం వల్ల స్థానికుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర దుష్ప్రభావం పడే అవకాశం ఉందని, ఇది వారి జీవితాలను అతలాకుతలం చేస్తుందని హెచ్చరించింది. రాజధాని నిర్మాణం కేవలం భవనాల కట్టడం మాత్రమే కాకుండా, వేల కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని గుర్తించాలని, వారి సామాజిక భద్రతకు పెద్దపీట వేయాలని ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. రైతులకు సంబంధించి గతంలో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు వారి ప్లాట్లను త్వరితగతిన అభివృద్ధి చేయాలని సోషల్ ఆడిట్ రిపోర్టు డిమాండ్ చేసింది. భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్లలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారానే వారికి అసలైన న్యాయం జరుగుతుందని స్పష్టం చేసింది. ప్లాట్ల అభివృద్ధిలో జాప్యం జరిగే కొద్దీ రైతుల్లో ఆందోళన పెరుగుతుందని, కాబట్టి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి వారికి అప్పగించడం ద్వారా రాజధానిపై నమ్మకాన్ని పునరుద్ధరించాలని ఈ నివేదిక ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసింది. అమరావతి ప్రాంతంలో భూమి లేని పేదలు మరియు రోజువారీ కూలీలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ ఆడిట్ నివేదిక సూచించింది. వ్యవసాయ భూములు రాజధానిగా మారడంతో ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు శాశ్వత పథకాలను అమలు చేయాలని కోరింది. వారి నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వడం లేదా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపిస్తూ వారి ఆర్థిక స్థిరత్వానికి హామీ ఇవ్వాలని, అప్పుడే రాజధాని అభివృద్ధి సమ్మిళితంగా సాగుతుందని నివేదిక సారాంశం వివరించింది.

## దాడులతో ప్రజలకి ఎలాంటి సందేశం ఎవ్వలనుకుంటున్నారు చంద్రబాబు?



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03,** రాష్ట్రాన్ని రావణకాష్టంగా చేయాలనుకుంటున్నారా? అంటూ ఏపీ శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రభుత్వం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబుపై జరిగిన దాడిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు దగ్గరుండి దాడి చేయిస్తారా? వైసీపీకి కార్యకర్తలు లేరని అనుకుంటున్నారా? అంటూ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ .. చంద్రబాబు నాయుడు అప్రతిష్టను మూటకట్టుకోవద్దని హితవు పలికారు. గత మూడు రోజులుగా కూటమి ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని ఆరోపించారు. వైసీపీ నేతలపై జరుగుతున్న దాడుల విషయంలో జనసేన, బీజేపీ నాయకులు ఎందుకు తప్పును తప్పు అని చెప్పడం లేదని బొత్స నిలదీశారు. తనను దుర్భాషలాడటం వల్లే రాంబాబు స్పందించారని తెలిపారు. అనంతరం ఇంటికి వచ్చి తాను మాట్లాడింది తప్పేనని అంగీకరించారని, అయినా కేంద్ర మంత్రి తడాఖా చూపిస్తామని మాట్లాడటం సరికాదన్నారు. ఎన్‌డీడీబీ రిపోర్ట్‌ను వైసీపీ తెచ్చిందా? అని బొత్స ప్రశ్నించారు. హిందువుల మనోభావాలతో ఆడుకోవడం న్యాయమా? అని ప్రశ్నించారు. తప్పు చేసిన వారిని దేవుడు కూడా క్షమించడని, ఎవరైనా సరే ఫలితం అనుభవించాల్సిందేనని అన్నారు. అంబటి ఇంటిపై పెట్రోల్ బాంబులు వేసి చంపాలనుకుంటున్నారా? అంటూ బొత్స తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## ఇండో-యూఎస్ ట్రేడ్ డీల్: మోదీ వ్యూహమా? ట్రంప్ ఏకపక్ష నిర్ణయమా? కాంగ్రెస్ ప్రశ్నల వర్షం



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03,** భారత్ మరియు అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై దేశీయంగా రాజకీయ దుమారం రేగుతోంది. ఈ కీలక ఒప్పందానికి సంబంధించిన ప్రకటనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. యుద్ధ విరమణ ఒప్పందం తరహాలోనే, ఈ ట్రేడ్ డీల్ విషయంలో కూడా ట్రంప్ ఆధిపత్యం కనిపిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రాధాన్యతను తగ్గించేలా ఈ పరిణామాలు ఉన్నాయని కాంగ్రెస్ తన గళాన్ని వినిపించింది.ప్రధాని మోదీ ప్రత్యేక అభ్యర్థన మేరకే ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని వస్తున్న వార్తలపై కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. కేవలం వ్యక్తిగత అభ్యర్థనల మీద దేశాల మధ్య ఒప్పందాలు జరగడం సరికాదని, దీని వెనుక ఉన్న అసలు కారణాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తోంది. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన కాంగ్రెస్ నేతలు, ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఉ ందా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. విదేశీ నేతల ప్రకటనల ద్వారానే మన దేశ నిర్ణయాలు తెలియడంపై వారు అసహనం వ్యక్తం చేశారు.ఈ ఒప్పందంలోని లోతుపాతులను, కీలక నిబంధనలను తక్షణమే బహిర్గతం చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. రహస్యంగా ఉ ంచాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తూ, ఒప్పంద పత్రాలలోని ప్రతి అంశాన్ని ప్రజల ముందు ఉంచాలని పేర్కొంది. ముఖ్యంగా వ్యవసాయం, ఐటీ, మరియు ఇతర ఎగుమతి రంగాలపై ఈ డీల్ ప్రభావం ఎలా ఉ ండబోతోందో ప్రభుత్వం వివరించాలని కాంగ్రెస్ కోరింది. పారదర్శకత లేని ఒప్పందాల వల్ల భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

చివరగా, ఇంతటి కీలకమైన అంతర్జాతీయ ఒప్పందం విషయంలో పార్లమెంటును మరియు దేశ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ సూచించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత ముఖ్యమని, సభలో చర్చించకుండా ఇలాంటి పెద్ద నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని పేర్కొంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి, భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంలోని అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని, దేశ ప్రయోజనాలను పణంగా పెట్టవద్దని కాంగ్రెస్ గట్టిగా డిమాండ్ చేసింది.

## భారతదేశం వదిలి వెళ్లిపోండి: వాట్సాప్, మెటా సంస్థలకు సుప్రీంకోర్టు సంచలన హెచ్చరిక!



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03,** భారతదేశ పౌరుల వ్యక్తిగత గోప్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మెటా యాజమాన్యానికి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. వాట్సాప్ ప్రైవసీ పాలసీకి సంబంధించిన కీలక విచారణలో భాగంగా, భారతీయ చట్టాలను గౌరవించని పక్షంలో ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిలిపివేసి వెళ్లిపోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు తమ ఇష్టానుసారం నిబంధనలు మార్చుకుంటే చూస్తూ ఊరుకోబోమని, దేశ ప్రయోజనాలే తమకు అత్యున్నతమని న్యాయస్థానం ఈ సందర్భంగా తేల్చి చెప్పింది.

ముఖ్యంగా వినియోగదారుల డేటా షేరింగ్‌పై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "మా దేశ ప్రజల గోప్యతతో మీరు ఆటలాడలేరు. ఇక్కడి డేటాలోని ఒక్క అక్షరాన్ని గానీ, కనీసం ఒక అంకెను కూడా ఇతరులతో పంచుకోవడానికి మేము అనుమతించము" అని ఆయన వ్యాఖ్యానించారు. భారతీయ డేటా భద్రత విషయంలో మెటా అనుసరిస్తున్న మొండి వైఖరిపై ధర్మాసనం తీవ్ర అసహనాన్ని ప్రదర్శిస్తూ, విదేశీ సంస్థలు స్థానిక చట్టాలకు లోబడి పని చేయాల్సిందేనని కరాఖండిగా చెప్పింది.

వాట్సాప్ తీసుకొచ్చిన వివాదాస్పద ప్రైవసీ పాలసీ అప్‌డేట్స్ గత కొంతకాలంగా దేశంలో చర్చనీయాంశంగా మారాయి. వినియోగదారుల సమాచారాన్ని ఇతర ఫేస్‌బుక్ అనుబంధ సంస్థలతో పంచుకోవడం ద్వారా ప్రైవసీ హక్కులకు భంగం కలుగుతోందని దాఖలైన పిటిషన్లపై కోర్టు సుదీర్ఘంగా విచారిస్తోంది. లాభాల కంటే పౌరుల ప్రాథమిక హక్కులే ముఖ్యమని, టెక్ కంపెనీలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం దేశ నిబంధనలను అతిక్రమించడం సరికాదని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు.

ఈ తీర్పు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ సంస్థలకు ఒక బలమైన సందేశాన్ని పంపింది. భారత్ వంటి భారీ మార్కెట్ ఉన్న దేశంలో వ్యాపారం చేయాలనుకుంటే, ఇక్కడి సార్వభౌమత్వాన్ని మరియు ప్రజల డేటా భద్రతను గౌరవించడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. భవిష్యత్తులో వాట్సాప్ తన పాలసీలను మార్చుకుంటుందా లేదా కోర్టు ఆదేశాల మేరకు కఠిన నిర్ణయాలను ఎదుర్కోవాల్సి వస్తుందా అనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

## మారుతున్న ప్రపంచ క్రమం: అమెరికాతో వాణిజ్య వ్యూహంపై ప్రధాని మోదీ ధీమా



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03,** అమెరికాతో కుదుర్చుకున్న తాజా వాణిజ్య ఒప్పందం భారత దౌత్య విజయం మాత్రమే కాదు, దేశం ప్రదర్శించిన సహనానికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఎన్డీయే (బీణూ) పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన, గతంలో టారిఫ్ల విషయంలో ఎదురైన విమర్శలను ప్రస్తావించారు. అప్పట్లో కొందరు తమ నిర్ణయాలను తప్పుపట్టినప్పటికీ, ప్రభుత్వం ఓపికతో వ్యవహరించిందని.. ఆ నిశ్శబ్ద వ్యూహాలే ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన సహచర సభ్యులకు వివరించారు. ప్రస్తుతం ప్రపంచ క్రమం వేగంగా మారుతోందని, అగ్రరాజ్యాలన్నీ భారతదేశం వైపు ఆశగా చూస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, భారత్ వాటిని తనకు అనుకూలంగా మార్చుకోగలిగిందని ఆయన విశ్లేషించారు. భారతదేశం అనుసరిస్తున్న తటస్థ మరియు ప్రయోజనకర విధానాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశం కీలక భాగస్వామిగా ఎదుగుతోందని, ఇది భారతీయులందరికీ గర్వకారణమని ఆయన కొనియాడారు.

కేవలం రాజకీయ స్థిరత్వం మాత్రమే కాకుండా, బలమైన ఆత్మవిశ్వాసం ఉంటే అసాధ్యమైన లక్ష్యాలను కూడా సులభంగా సాధించవచ్చని ప్రధాని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. దీనికి సంబంధించి ఆయన అంతకుముందే సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, ఆత్మవిశ్వాసమే ప్రగతికి అసలైన ఇంధనమని ట్వీట్ చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా వెనకడుగు వేయకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్లే దేశం నేడు అంతర్జాతీయ వేదికపై తనదైన ముద్ర వేయగలుగుతోందని ఆయన గుర్తు చేశారు.

భారత ప్రయోజనాలే పరమావధిగా సాగుతున్న ఈ ప్రయాణంలో మరిన్ని విజయాలు వస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని దేశాలతో వ్యూహాత్మక ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా అడుగులు వేయాలని, తద్వారా భారత్‌ను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని ఆయన పిలుపునిచ్చారు. అగ్రరాజ్యం అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం కేవలం ప్రారంభం మాత్రమేనని, భవిష్యత్తులో భారత వాణిజ్య రంగం మరింత పుంజుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## సరిహద్దు వివాదంపై వెనక్కి తగ్గేదే లేదు: పార్లమెంటులో రాహుల్ గాంధీ ధీటుగా స్పందన



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03,** చైనా సరిహద్దు ఉద్రిక్తతలపై తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నిన్న పార్లమెంటులో ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఈరోజు సభలో ఆయన మరోసారి గట్టిగా సమర్థించుకున్నారు. దేశ భద్రత విషయంలో తాను రాజీ పడే ప్రసక్తే లేదని, వాస్తవాలను సభ దృష్టికి తీసుకురావడం తన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల్లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

తాను చేసిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితం కాదని, అవి కేవలం దేశ క్షేమం కోసమేనని రాహుల్ గాంధీ వివరించారు. సరిహద్దుల్లో చైనా ఆక్రమణలు సాగుతున్నాయని, దీనిపై కేంద్రం మౌనం వహించడం సరికాదని ఆయన పునరుద్ఘాటించారు. దేశ సార్వభౌమాధికారం ముప్పులో ఉన్నప్పుడు మౌనంగా ఉండలేనని, అందుకే ఈ అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నానని ఆయన సభకు తెలిపారు. నిన్నటి తన ప్రసంగంలోని ప్రతి మాటకు తాను బాధ్యత వహిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

మరోవైపు, రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అధికార పక్షం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. బీజేపీ నేతలు ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, పార్లమెంటులో గందరగోళం సృష్టించారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశాలను రాజకీయం చేయడం సరికాదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, సైన్యం మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని అధికార పార్టీ నేతలు మండిపడ్డారు. ఈ వాదోపవాదాలతో పార్లమెంటులో వాతావరణం వేడెక్కింది.

ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేయగా, ప్రభుత్వం మాత్రం రాహుల్ వైఖరిని తప్పుపడుతూ రక్షణ యంత్రాంగంపై విశ్వాసం ఉంచాలని కోరింది. సరిహద్దు వివాదం ప్రస్తుతం రాజకీయ రణరంగంగా మారిపోయింది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ తన వైఖరిని మార్చుకోకుండా సభలో నిలదీయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## మోదీ 'ఇమేజ్' చుట్టూ అంతర్జాతీయ ఉచ్చు.. రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 03,** ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతం తన అంతర్జాతీయ ప్రతిష్ట దెబ్బతింటుందనే ఆందోళనలో ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో అదానీ గ్రూప్‌పై నమోదైన తాజా న్యాయపరమైన కేసులు కేవలం ఒక వ్యాపార సంస్థకు సంబంధించినవి కాదని, అవి నేరుగా మోదీ నిర్మించుకున్న ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకున్నాయని ఆయన విశ్లేషించారు. ఈ పరిణామాలు ప్రధానిని రక్షణ స్థితిలోకి నెట్టాయని, అందుకే ఆయన తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని రాహుల్ పేర్కొన్నారు.అమెరికాలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్ అంశాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ మరిన్ని కీలక ఆరోపణలు చేశారు. ఈ ఫైల్స్‌లో ఉన్న కొన్ని సున్నితమైన విషయాలు బయటకు వస్తాయనే భయం ప్రధానిలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా ప్రభుత్వం ఈ ఫైల్స్‌కు సంబంధించి ఇంకా పూర్తి వివరాలను వెల్లడించలేదని, ఒకవేళ అవి బయటపడితే రాజకీయంగా పెను మార్పులు సంభవిస్తాయని రాహుల్ హెచ్చరించారు. ఈ అంతర్జాతీయ పరిణామాలన్నీ మోదీ ఇమేజ్‌ను నీరుగార్చేలా ఉన్నాయని ఆయన వివరించారు.అదానీ గ్రూపుపై వస్తున్న ఆరోపణలు భారత ఆర్థిక మూలాలను దెబ్బతీసేవిగా ఉన్నాయని, దీనికి ప్రభుత్వ అండదండలే కారణమని రాహుల్ దుయ్యబట్టారు. విదేశీ గడ్డపై జరుగుతున్న ఈ విచారణలు ప్రధాని మోదీకి వ్యక్తిగతంగా మరియు రాజకీయంగా పెద్ద సవాలుగా మారాయని ఆయన అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నారని, ఈ క్రమంలోనే ఆయన మౌనం వహిస్తున్నారని ప్రతిపక్ష నేత విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రపంచ వేదికపై భారత ప్రధాని ఇమేజ్ గ్రాఫ్ పడిపోతోందని, అగ్రరాజ్యాల వద్ద ఉన్న కీలక సమాచారం ఇప్పుడు మోదీకి గుబులు పుట్టిస్తోందని రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ నుండి అదానీ వివాదం వరకు అన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని, ఇవి ప్రధానిని ఇరకాటంలో పడేశాయని ఆయన ఆరోపించారు. రాబోయే రోజుల్లో ఈ అంశాలు భారత రాజకీయాల్లో ఎటువంటి మలుపులు తిరుగుతాయో వేచి చూడాలని రాహుల్ తన ప్రసంగంలో ముగించారు.

# సినిమా



## పారిశుద్ధ్య కార్మికురాలిని ఇంటికి పిలిపించి మరీ గోల్డ్ చైన్ ఇచ్చిన రజనీకాంత్.

కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. చెన్నై మహానగర పాలకసంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మను ఇంటికి పిలిచి మరీ సత్కరించారీ సీనియర్ హీరో. ఆమె నిజాయతీని మెచ్చుకోవడంతో పాటు ఒక బంగారు గొలుసును కానుకగా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. పద్మ చెన్నై నగరంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. ఇటీవల ఆమెకు 45 తులాల బంగారం దొరికింది. ప్రస్తుతమన్న మార్కెట్ లో గోల్డ్ రేట్స్ చూసి వేరొకరైతే ఆ బంగారాన్ని తమ వద్దే ఉంచుకునేవారు. కానీ నిజాయతీ గల పద్మ ఆ పని చేయలేదు. తనకు దొరికిన ఆ బంగారాన్ని వెంటనే పోలీసులకు అప్పగించింది. దీంతో ఆమెపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. పద్మ నిజాయతీని మెచ్చుకుంటూ అందరూ ఆమెను మెచ్చుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న తలైవా రజనీకాంత్ కూడా పద్మను ఇంటికి పిలిపించారు. ఆమెతో ఆప్యాయంగా మాట్లాడారు. ఘనంగా సన్మానం చేసి ఒక బంగారపు గొలుసు గిఫ్ట్‌గా అందించారు. సూపర్ స్టార్ స్వయంగా తనను ఇంటికి పిలిపించి సన్మానించడంతో పద్మ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. పద్మతో పాటు ఆమెను ఘనంగా సత్కరించిన రజనీకాంత్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా పద్మ నిజాయతీకి ప్రతీకగా ఆమెకు భారత తపాలా శాఖ ఇటీవలే అరుదైన గౌరవాన్ని అందించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆమెకు రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా అందించింది. ఇక తమిళనాడు ప్రభుత్వం ఆమెను అభినందిస్తూ రూ.లక్ష నగదు బహుమతిని అందించింది





## నిద్ర పట్టడం లేదా? కీళ్లు నొప్పులుగా ఉన్నాయా?

అశ్వగంధ కేవలం ఒక మూలిక మాత్రమే కాదు, అది శరీరంలోని హార్మోన్లను క్రమబద్ధీకరించే ఒక శక్తివంతమైన ఔషధం. ఒత్తిడిని తగ్గించే కార్టిసాల్ నియంత్రణ నుండి, పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచడం వరకు ఇది ఎంతో మేలు చేస్తుంది. దాల్చిన చెక్క, అల్లం, యాలకులు కలిపి తయారు చేసే ఈ టీ రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాల్లోనూ సాటిలేనిది. ఈ అద్భుత టీ తయారీ విధానం దాని వల్ల కలిగే షాకింగ్ హెల్త్ బెనిఫిట్స్ గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

అశ్వగంధ టీ వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు:

రోగనిరోధక శక్తి : చలికాలంలో మారుతున్న సీజన్లలో వచ్చే జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలను ఎదుర్కోవడానికి ఇది శరీరానికి అవసరమైన బలాన్ని ఇస్తుంది.

ఒత్తిడి ఆందోళన: శరీరంలో ఒత్తిడిని కలిగించే 'కార్టిసాల్' హార్మోన్‌ను ఇది అదుపులో ఉంచుతుంది. దీనివల్ల మానసిక ప్రశాంతత చేకూరి, ఆందోళన తగ్గుతుంది.

బరువు నియంత్రణ: అశ్వగంధ టీ శరీర మెటబాలిజంను (జీవక్రియ) వేగవంతం చేస్తుంది. దీనివల్ల కొవ్వు నిల్వలు కరిగి, బరువు తగ్గడం సులభమవుతుంది.

కీళ్ల నొప్పులు: ఇందులోని 'యాంటీ ఇన్ఫ్లమేటరీ' గుణాలు ఆర్థరైటిస్ మరియు కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. కీళ్లలో దృఢత్వాన్ని తగ్గించి నడకను సులభతరం చేస్తుంది.

మంచి నిద్ర: నిద్రలేమి సమస్యతో బాధపడేవారు ఈ టీని క్రమం తప్పకుండా తీసుకుంటే నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది.

అశ్వగంధ టీ తయారీకి కావలసినవి:

అశ్వగంధ పొడి (అర చెంచా), దాల్చిన చెక్క పొడి, అల్లం తురుము, యాలకులు, తులసి ఆకులు రుచికి తగినంత బెల్లం.

గమనిక: ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. అశ్వగంధ టీని ప్రారంభించే ముందు గర్భిణీలు లేదా ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి.



## పసుపు పాలు తాగుతున్నారా?

భారతీయ ఇళ్లలో రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగడం అనేది ఒక ఆచారం. జలుబు చేసినా, ఒళ్లు నొప్పులుగా ఉన్నా, రోగనిరోధక శక్తి పెంచుకోవాలన్నా మనకు గుర్తొచ్చే మొదటి చిట్కా ఇదే. అయితే మనలో చాలామంది పసుపు పాలు తయారు చేసేటప్పుడు ఒక కీలకమైన పొరపాటు చేస్తున్నారని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ఒక్క తప్పు వల్ల పసుపులోని గుణాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. పసుపులో కర్కుమిన్ అనే అద్భుతమైన పదార్థం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. మిరియాల్లో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పసుపులోని కర్కుమిన్‌ను శరీరం గ్రహించే శక్తిని ఏకంగా 2,000% పెంచుతుంది. అంటే మీరు మిరియాలు వేయకుండా పసుపు పాలు తాగితే, మీరు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు మీకు అందవు.

కర్కుమిన్ కొవ్వులో కరుగుతుంది. కాబట్టి పాలలో చిటికెడు నెయ్యి లేదా కొబ్బరి నూనె వేస్తే అది వేగంగా శరీరానికి అందుతుంది. తెల్ల చక్కెర ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పసుపు పాలలో సహజమైన తీపి కోసం బెల్లం లేదా తేనె వాడటం మంచిది. ప్యాకెట్ పసుపు కంటే పసుపు కొమ్ములను దంచి వాడితే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రాత్రి పూట పసుపు పాలు తాగడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులను తగ్గించడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. పసుపు పాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పసుపు పాలు ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ.. అతిగా తాగడం వల్ల వేడి చేసే అవకాశం ఉంటుంది. అలాగే గర్భిణీలు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.

## వినాశకాలే విపరీత బుద్ధి..

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ తీసుకున్న మొండి నిర్ణయంపై భారత క్రికెట్ దిగ్గజం, 1983 వరల్డ్ కప్ హీరో కపిల్ దేవ్ నిప్పులు చెరిగారు. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల నష్టపోయేది భారత్ కాదు, పాకిస్థానేనని ఆయన హెచ్చరించారు. ఈ నిర్ణయం పాక్ క్రికెటర్ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

టీ20 వరల్డ్ కప్‌లో భారత్ -- పాక్ మ్యాచ్‌పై జరుగుతున్న రచ్చపై కపిల్ దేవ్ ఘాటుగా స్పందించారు. "మీరు కేవలం ఒక మ్యాచ్‌ను బహిష్కరించడం లేదు, పాకిస్థాన్ క్రికెటర్ల మొత్తం ఒక తరాన్ని నాశనం చేస్తున్నారు" అని ఆయన హెచ్చరించారు. పాకిస్థాన్‌లో అద్భుతమైన టాలెంట్ ఉందని, కానీ బోర్డు తీసుకునే ఇలాంటి రాజకీయ నిర్ణయాల వల్ల యువ ఆటగాళ్ల కెరీర్లు బుడగలా పేలిపోతాయని కపిల్ అన్నారు. రాజకీయాలు, ఈగోల కోసం క్రీడలను బలి చేయడం ఏమాత్రం తగదని సూచించారు.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వైఖరిని తప్పుబడుతూ కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఒక వ్యక్తి అహంకారం దేశం కంటే లేదా ఆట కంటే పెద్దది కాకూడదు. ఆటగాళ్లకు ఆడటం ఇష్టం లేకపోతే వారు నేరుగా చెప్పాలి, అంతే కానీ బోర్డు ఒత్తిడితో ఆడబోమని చెప్పడం దేశ ప్రతిష్టను దిగజార్చడమే" అని పేర్కొన్నారు. పాక్ ఆటగాళ్లు తమ గళాన్ని వినిపించాలని, బోర్డు నిర్ణయాలకు బలి కావొద్దని ఆయన కోరారు.

ఒకవేళ పాకిస్థాన్ భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే, ఐసీసీ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని కపిల్ హెచ్చరించారు. "దీర్ఘకాలంలో పాకిస్థాన్‌ను ఎవరూ మిస్ అవ్వరు. అభిమానులు వేరే మ్యాచ్‌లను చూస్తారు, ప్రపంచం ముందుకు సాగిపోతుంది. కానీ పాకిస్థాన్ మాత్రం అంతర్జాతీయ క్రికెట్‌లో ఏకాకిగా మిగిలిపోతుంది" అని ఆయన విశ్లేషించారు. ఐసీసీ నిబంధనల ప్రకారం ప్రభుత్వ జోక్యం ఉంటే సభ్యత్వం రద్దు చేసే అవకాశం కూడా ఉంటుందని గుర్తు చేశారు.

బంగ్లాదేశ్ జట్టు తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలని కోరినప్పుడు ఐసీసీ తిరస్కరించింది. దీనికి నిరసనగా పాక్ ప్రభుత్వం తమ జట్టు భారత్‌తో ఆడదని ప్రకటించింది. అయితే, ఇప్పటికే భారత్-పాక్ మ్యాచ్ శ్రీలంకలోనే జరుగుతున్నప్పుడు, పాక్ బహిష్కరించడం వెనుక ఎలాంటి తర్కం లేదని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డారు. ఇది కేవలం పాక్ యువ క్రికెటర్ల కలలను సమాధి చేయడమేనని ఆయన కుండబద్దలు కొట్టారు.



## మారిన క్రికెట్ రూల్స్.. బంతి సైజు కూడా

క్రికెట్ నిబంధనలను రూపొందించే అత్యున్నత సంస్థ మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ 2026 ఏడాదికి గానూ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ఆటలో మరింత పారదర్శకత, ఉత్కంఠను పెంచేందుకు టెస్ట్ క్రికెట్‌తో పాటు మహిళల క్రికెట్‌లోనూ కీలక మార్పులు చేస్తూ కొత్త చట్టాలను ప్రకటించింది. ముఖ్యంగా టెస్ట్ మ్యాచ్‌లలో ఆఖరి నిమిషం వరకు డ్రామా కొనసాగేలా ఎంసీసీ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు క్రీడాలోకంలో చర్చనీయాంశంగా మారింది. టెస్ట్ క్రికెట్‌లో ఇప్పటిదాకా ఒక ఆనవాయితీ ఉండేది. అదేంటంటే రోజు ఆట ముగిసే సమయానికి (చివరి ఓవర్లో) ఏదైనా వికెట్ పడితే, వెంటనే ఆ రోజు ఆటను ముగించేసేవారు. దీనివల్ల బ్యాటింగ్ చేసే జట్టుకు ఒక వెసులుబాటు ఉండేది. వారు మరుసటి రోజు ఉదయం తమ వ్యూహానికి తగ్గట్టుగా కొత్త బ్యాటర్‌ను పంపేవారు. కానీ, ఎంసీసీ కొత్త చట్టం 12.5.2 ప్రకారం.. ఇకపై చివరి ఓవర్లో వికెట్ పడినా సరే, ఆ ఓవర్ పూర్తి కావాల్సిందే. అంటే, కొత్త బ్యాటర్ వెంటనే క్రీజులోకి వచ్చి ఆ ఓవర్లో మిగిలిన బంతులను ఎదుర్కోవాలి. దీనివల్ల ఫీల్డింగ్ టీమ్‌కు బ్యాటర్‌పై ఒత్తిడి పెంచే అవకాశం దక్కుతుంది.

మహిళల క్రికెట్‌ను మరింత వేగవంతం చేసేందుకు ఎంసీసీ బంతి బరువు,సైజులో మార్పులు చేసింది. ఇప్పటివరకు మహిళల క్రికెట్‌లో బంతి బరువు 140 నుండి 151 గ్రాముల మధ్య ఉండేది. ఇప్పుడు దాన్ని 140 నుండి 149 గ్రాములకు తగ్గించారు. అలాగే బంతి పరిమాణం కూడా 21.5 నుండి 22 సెంటీమీటర్లుగా నిర్ణయించారు. దీనివల్ల బౌలర్లు మరింత వేగంతో బంతులు విసరడానికి, అలాగే బ్యాటర్లు భారీ షాట్లు కొట్టడానికి వీలవుతుందని భావిస్తున్నారు.

కేవలం అంతర్జాతీయ క్రికెట్ మాత్రమే కాకుండా, పునాది స్థాయి క్రికెట్‌లోనూ మార్పులు తెచ్చారు. అండర్-13 జూనియర్ క్రికెట్‌లో వాడే బంతి బరువును 140-144 గ్రాములుగా స్థిరీకరించారు. దీని సైజు కూడా 20.5 నుంచి 21 సెంటీమీటర్ల మధ్య ఉండేలా నిబంధనలు మార్చారు. వర్ధమాన క్రీడాకారులు సరైన బరువున్న బంతితో ప్రాక్టీస్ చేయడం వల్ల భవిష్యత్తులో వారు సీనియర్ లెవల్‌కు వెళ్ళినప్పుడు ఇబ్బంది పడకుండా ఉంటారని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయి?

ఈ కొత్త నిబంధనలు 2026 జనవరి నుంచి ప్రపంచవ్యాప్తంగా జరిగే అన్ని అధికారిక క్రికెట్ మ్యాచ్‌లకు వర్తిస్తాయి. దీనివల్ల టెస్ట్ క్రికెట్‌లో ఆఖరి ఓవర్లలో వికెట్ పడితే వచ్చే ఉత్కంఠ మరింత పెరుగుతుంది. ముఖ్యంగా డ్రా అయ్యే స్థితిలో ఉన్న మ్యాచ్‌లలో ఈ రూల్ గేమ్ ఛేంజర్‌గా మారే అవకాశం ఉంది. ఎంసీసీ తీసుకున్న ఈ చారిత్రక నిర్ణయం పట్ల మాజీ క్రికెటర్లు మరియు విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com